క్లుప్తంగా

కోసువారిపల్లెలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్ర నాథ్, పలుశాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు వేణుగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మీ, ఎంపీటీసీలు శ్యామలమ్మ, అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కోటిరెడ్డి, శంకర్‌రెడ్డి, రఘు, హరి, బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మగ్గాల లక్ష్మయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మద్యంతో పట్టుబడిన ఇద్దరిపై కేసు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతి కోట క్రాస్ వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించగా అక్రమ మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. బి.కొత్తకోటకు చెందిన జనార్దన్ (45) కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తుండగా పోలీసుల తనిఖీలో 40 ప్యాకెట్ల మద్యం పట్టుబడింది. అలాగే సంపతి కోట పంచాయతీ ముంతపోగులవారిపల్లికి చెందిన సాకే వెంకట్రమణ (60) సంచిలో 15 కర్ణాటక ప్యాకెట్లతో పట్టుబడ్డాడు. ఇద్దరు నిందితులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బుధవారం పేర్కొన్నారు.

తిరుప్పావై ప్రవచనాలు

మదనపల్లె సిటీ: ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక బర్మావీధిలోని షిర్డిసాయిబాబా ఆలయంలో బుధవారం తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఆలయ మండపంలో గోదా,రంగనాథుని చిత్రపటాలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. తిరుప్పావైలోని పాసురాలను పఠించారు. మహిళలు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాబు నాయుడు, అర్చకులు రాము తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ యువసేన అధ్యక్షుడి నియామకం

పీలేరు రూరల్ : కాపు సంక్షేమ సేన పీలేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా అండే సురేష్‌బాబును నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోటుకూరి ఆనంద్ తెలిపారు. బుధవారం పట్టణంలో కాపు సంక్షేమ సేన సమావేశం నిర్వహించి నియోజకవర్గ కమిటీని నియమించారు. కలికిరి మండల అధ్యక్షులుగా కె. మహేష్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు మోకాటి సుబ్బయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షులు శ్రీరామ్‌గోపి, నాయకులు నవీన్, రామ్మూర్తి, మల్లికార్జు, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై ఇంటింటి సర్వే పూర్తి చేయండి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కలకడ : కుష్టువ్యాధిని గుర్తించడం కోసం మండలంలోని ప్రతి ఇంటిని సర్వే చేసి జనవరి 12వ తేదీ లోపూర్తి చేయాలని కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ జవహర్ బాబు అన్నారు. బుధవారం ఎర్రకోటపల్లె, కలకడ పీహెచ్‌సీ పరిధిలో ఆశవర్కర్లు, వలంటీర్‌ల తో కలిపి కుష్టు నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి వ్యక్తికి తల నుంచి కాలి వరకూ పరిశీలించి స్పర్శలేని మచ్చలు ఉంటే గుర్తించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి రోజు కనీసం 15-20 కుటుంబాలను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు వాణి, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో మొక్కల పెంపకం లాభసాటి

కలకడ : సేంద్రియ ఎరువులతో మొక్కల పెంపకం ఎంతో లాభసాటి అని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. బుధవారం మండలంలోని గుడిబండ పంచాయతీలో అరబిందోఫార్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతులకు మొక్కల పెంపకం ద్వారా చేకూరే లబ్ధి, అంతర్ పంటల సాగుతో పొందే ప్రయోజనాలను తెలియజేశారు. పంటల సాగు, మొక్కల సాగులో మంచి ఫలితాలు పొందిన రైతులను అభినందించారు. అలాగే ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, అరబిందోఫార్మ ఫౌండేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సారా విక్రేతకు రిమాండ్

కలికిరి: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రహీముల్లా తెలిపారు. వివరాలిలా.. కలికిరి క్రాస్ రోడ్డు సమీపంలోని హేమాచారి కళ్యాణ మండపం వెనుకవైపున నాటు సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పట్టణానికి చెందిన పి.బ్రహ్మాచారి సారా అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘ఆడుదాం ఆంధ్ర’తో క్రీడలపై ఆసక్తి

డీపీఓ ధనలక్ష్మి





మదనపల్లె: వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీపీఓ ధనలక్ష్మి, ములకలచెరువు: గెలుపొందిన క్రీడాకారులతో అధికారులు

మదనపల్లె : ఆడుదాం ఆంధ్రాతో క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది. యువతలో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించి ఉత్తమ క్రీడాకారులుగా తయారుచేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో రెండోరోజు జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ఆమె పరిశీలించారు. వాలీబాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడాపోటీలను తిలకిస్తూ, విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. వార్డు, గ్రామస్థాయి నుంచి పోటీలు నిర్వహిస్తుండటంతో పిల్లలకు, యువతకు క్రీడలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. పోటీల్లో క్రీడాకారులు ఆటల నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. క్రమశిక్షణ, స్నేహపూర్వక వాతావరణంలో క్రీడాపోటీలు జరగాలన్నారు. స్కోర్, నిర్వహణ పారదర్శకంగా జరగాలన్నారు. ప్రభుత్వం ఏ ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తోందో, లక్ష్యం నెరవేరే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మదనపల్లె మండలం ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించి రెండోరోజు 13 టీమ్‌లు ఆడాల్సి ఉండగా, కొన్ని కారణాలతో 1 టీం హాజరు కాలేదు. జెడ్పీహైస్కూల్, శ్రీవేద, వశిష్ట పాఠశాలల్లోని క్రీడామైదానాల్లో వాలీబాల్, క్రికెట్, ఖోఖో ఆటలను నిర్వహించారు. మున్సిపాలిటీకి సంబంధించి 50 టీమ్‌లు జీఆర్‌టీ గ్రౌండ్స్, టిప్పుసుల్తాన్ మైదానం, జెడ్పీహైస్కూల్‌లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్ క్రీడలు ఆడాయి. క్రీడాపోటీలను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో గ్రౌండ్స్‌కు చేరుకుని, ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య, పీఈటీ దేవకమ్మ, మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సంబరాలు

పెద్దతిప్పసముద్రం: ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు ఆరంభమైన నేపథ్యంలో పోటీలకు యువత నుంచి విశేష స్పందన లభిస్తోంది. బుధవారం జరిగిన ఖోఖో పోటీలకు క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై పోటీ పడేలా చేయడం ఆడుదాం-ఆంధ్రా ప్రధాన లక్ష్యమని పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

ములకలచెరువు: ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం ఎంపీడీఓ పోలప్ప, సర్పంచ్ విజయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. పోటీల్లో బురకాయలకోట టీం గెలుపొందింది. క్రీడాకారులకు సర్పంచ్, ఎంపీడీవో రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆజాద్, ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రతో క్రీడాకారుల ప్రతిభకు పట్టం

వాల్మీకిపురం: ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడాకారుల ప్రతిభకు పట్టం కట్టే వేదిక అని వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చారావాండ్లపల్లి సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ఈవెంట్ ద్వారా 5 విభాగాల్లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించడం చరిత్రాత్మకమన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రీడలపట్ల ఆసక్తి చూపించి తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, ఫారుఖ్, శ్రీనివాసులు, ముబారక్, హర్షద్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో క్రికెట్ పోటీలు

తంబళ్లపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం రేణుమాకులపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. హెచ్ఎం రమేష్, పీడీలు మొగల్‌బాషా, మొహిద్దీన్‌ల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. రేణుమాకులపల్లె, కోటకొండ సచివాలయాల పరిధిలో 8 టీమ్‌లు పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచు మహ్మద్‌అలీ, పంచాయతీ కార్యదర్శి సాకెమ్మ, నాయకులు ప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్, రెడ్డెప్పరెడ్డి తదితరులు ఉన్నారు.







వాల్మికిపురం: ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు, పెద్దతిప్పసముద్రం: ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు, తంబళ్లపల్లె: క్రికెట్ క్రీడాకారులతో హెచ్ఎం రమేష్

కేంద్ర బృందం పరిశీలన

కలికిరి: జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి ప్రకాష్ కిచ్చి, జియో సైంటిస్ట్ ఏఎస్ పవార్ బృందం బుధవారం సాయంత్రం కలికిరి సమీపంలోని సీఎల్ఆర్‌సీ కార్యాలయ ఆవరణలోని రూఫ్ టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ వర్క్‌ను పరిశీలించారు. అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ ఎంసీ మద్దిలేటి, కలికిరి క్లస్టర్ ఏపీడీ నందకుమార్ రెడ్డి వర్షపు నీరు సద్వినియోగంపై కేంద్ర కమిటీకి వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు భేష్

– సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్ ఖిచ్చి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్ ఖిచ్చి

పీలేరు రూరల్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు సంతృప్తికరంగా ఉన్నాయని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్ ఖిచ్చి అన్నారు. బుధవారం మండలంలోని శివరామపురం, రేగళ్లలో పారంపాండ్స్, హార్టికల్చర్, రూఫ్‌వాటర్, బోర్‌వేల్స్ పనులను పరిశీలించారు. వైఎస్సార్ జలకల బోర్లు పరిశీలించి వాటి వల్ల భూగర్భ జలాల పెంపొందించుకోవచ్చునని తెలిపారు. రైతులతో ముఖా ముఖి నిర్వహించి ఉపాధి పనులతో కల్గిన ప్రయోజనాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పథకాలు సద్వినియోగం చేసుకుని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ టెక్నికల్ ఆఫీసర్ అధర్వపవార్, డ్వామా పీడీ ఎంసీ మద్దిలేటి, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, ఏపీవో మహేశ్వర్, సింగిల్ విండో అధ్యక్షుడు నారే వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణంలోని ప్రశాంత్ నగర్, బాపూజీ నగర్, ఐసీరెడ్డి బంగ్లా తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అందించిన పథకాలు చదివి వినిపించడం తోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలు అప్పటికప్పుడు సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో వందశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం చెందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం లభిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు గతంలో 650 హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, మరోసారి ప్రజలను మభ్యపెడుతూ ఉచిత హామీలు ఇస్తున్నారని, ఎవరూ మోసపోరాదన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సమగ్ర శిక్షాప్రాజెక్టులో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేయాలన్నారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. క్యాక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు నారే వెంకటరమణారెడ్డి, స్టాంపుల నరసింహారెడ్డి, మహితాఆనంద్, హుమయూన్, నాగభూషణం, నాగేంద్ర, జయచంద్రారెడ్డి, కంభం భాస్కర్‌రెడ్డి, చక్రధర్, అరుణ, షఫూరా తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’తో సమస్యల పరిష్కారం

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం «జగనన్నకు చెబుదాం» కార్యక్రమాన్ని మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. పెద్దమండ్యంలో పాతచెరువు ఆక్రమణకు గురైనట్లు రైతులు ఫిర్యాదు చేశారు. అలాగే భూ సమస్యల పరిష్కారం కోసం పలువురు రైతులు వినతి చేశారు. ఇంటిపట్టాలు, డ్రైనేజీ నిర్మాణం, పక్కాగృహాలు మంజూరు కోసం ప్రజలు విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే అర్జీదారుల సమక్షంలో మాట్లాడారు. కార్యక్రమంలో 101 మంది నుంచి అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రెవెన్యూకు సంబంధించి 69, పంచాయతీ రాజ్ శాఖకు 11 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర పిళ్లై, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం, మండల ప్రత్యేక అధికారి రవి, ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ, తహసీల్దార్ రాము, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఆయా శాఖల డీఈలు, ఏఈలు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి

పీలేరు రూరల్ : మండలంలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. మేళ్లచెరువు దళితవాడలో 33 ఇళ్లు వర్షానికి పూర్తిగా తడిసిపోతున్నాయని, ఇళ్లు మంజూరు చేయాలని, పలు కాలనీల్లో పొసిసన్ కావాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధనుంజయలు మాట్లాడుతూ ప్రభుత్వ కాలనీల్లో పొసిసన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వీలు కాదన్నారు. పట్టా భూముల్లో గానీ, గ్రామ కంఠంలో గానీ ఇళ్లు కట్టుకుంటే పొసిసన్ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, దళిత నాయకులు ధరణి, సుధాకర్, గట్టప్ప, రాజమ్మ, శ్రీనివాసులు, గండికోట వెంకటేష్, నారాయణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిట్లాకుప్ప స్థలం ఆక్రమణపై ఏఓకు ఫిర్యాదు



డీఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ముష్టూరువాండ్లపల్లె ప్రజలు

మదనపల్లె : వాల్మీకిపురం మండలం నగరిమడుగు గ్రామం సర్వేనెం.658-1, 2 చెరువు పొరంబోకులో సంక్రాంతి పండుగకు చిట్లాకుప్ప వేసి, పశువుల పండుగ జరుపుకునే స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని ముష్టూరువాండ్లపల్లె ప్రజలు సబ్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం డీఏఓ శేషయ్యను గ్రామస్తులు కలిశారు. గ్రామస్తులు కలిసికట్టుగా పండుగ జరుపుకునేందుకు వీలుగా స్థలాన్ని ఆక్రమణ నుంచి విడిపించి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, శిద్ధారెడ్డి, నారదరెడ్డి, రెడ్డెప్ప, శేషాద్రి, రెడ్డెప్ప, వెంకటరెడ్డి ఉన్నారు.

పెయ్యదూడల ఉత్పత్తి పథకం విజయవంతం

- పశుజాతి వేగంగా వృద్ధి చెందేందుకు దోహదం
- రైతులకు ఎక్కువ లాభం పొందే అవకాశం
- తిరుపతి సెమన్‌బ్యాంక్ డిప్యూటీ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం




పెయ్యదూడల ప్రదర్శనశాలలో రైతులతో మాట్లాడుతున్న డీడీ బాలసుబ్రహ్మణ్యం

మదనపల్లె : రాష్ట్రంలో పశుసంపదను పెంచి, గణనీయమైన పాల ఉత్పత్తిని సాధించి, తద్వారా రైతుకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని ప్రారంభించిందని తిరుపతి సెమన్‌బ్యాంక్ డిప్యూటీ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా చూలుకట్టిన దూడల ప్రదర్శన ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీడీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. నవంబర్, 2022న ప్రారంభమైన పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో భాగంగా ఏపీఐపీ-లింగనిర్ధారిత వీర్యంతో ఆవుల్లో చేసిన ప్రయోగం 90శాతానికిపైగా విజయవంతమైందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,500 ఆవులకు ఒకోదానికి రెండు డోసుల చొప్పున 9,000 డోసులు పంపిణీ చేశామన్నారు. 2,140 ఆవులకు చూడిపరీక్షలు చేస్తే, 1278 ఆవులు పాజిటివ్‌గా తేలాయన్నారు. అందులో ప్రస్తుతం 165 పెయ్యదూడలు పుట్టాయన్నారు. మదనపల్లె డివిజన్ పశువైద్యశాల పరిధిలోని మూడు మండలాల్లో 3,500 సెమన్ డోసుల పంపిణీ చేస్తే 90శాతం పెయ్యదూడలు, 10శాతం కోడెదూడలు జన్మించాయన్నారు. ఈ పథకం ద్వారా పశుజాతి వేగంగా వృద్ధి చెందేందుకు, రైతుకు ఎక్కువ లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకం మదనపల్లె డివిజన్‌లో విజయవంతం అయ్యేందుకు కృషిచేసిన సిబ్బందిని అభినందించారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో రెండు సెమన్ డోసుల విలువ రూ.1,350 అయితే ప్రభుత్వ రాయితీలు పోనూ రూ.500కే అందిస్తున్నామన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో లబ్ధి పొందిన రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రదర్శనకు వచ్చిన దూడలకు పశుసంవర్ధకశాఖ వైద్యులు డీవార్మింగ్, కాల్షియం టానిక్, మినరల్ మిక్చర్‌ను ఉచితంగా అందించారు. రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీ కే.రోహిణి, డాక్టర్.లారెన్స్, ప్రసాద్‌రెడ్డి, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ నరసింహారెడ్డి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి.సుమలత, అనిల్, ఖాదర్‌వలీ, భానుప్రకాష్, సహాయకులు సాయివినయ్, గోపాలమిత్ర హిమగిరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేళకు బస్సులు నడపాలి

మదనపల్లె సిటీ: సిబ్బంది సమయపాలన తప్పకుండా పాటించాలని ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు.బుధవారం స్థానిక వన్ డిపో కార్యాలయంలో మదనపల్లె-తిరుపతి రూట్లలో బస్సులు కేటాయించిన సమయంకు బస్సులు తిప్పాలన్నారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ఆదాయం పెంచాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



డీటీ విజయారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

పీలేరు : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తారీఖున జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ, డీఏ అరియర్లు, పీఎఫ్ లోన్లు, ఫైనల్ పేమెంటు చెల్లించాలని కోరారు. అనంతరం డీటీ విజయారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బి. చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, జి. రాధాకృష్ణ, ఈశ్వర్‌మహేంద్ర, సుధాకర్, వేణుగోపాల్, చెంగారెడ్డి, మస్తాన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరసన

మదనపల్లె సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏపీజీఎల్‌ఐ లోన్లు తక్షణం చెల్లించాలన్నారు. ఉద్యోగులు అందరికీ ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పురం రమణ, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థిని



గురుప్రియను అభినందిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం

నిమ్మనపల్లె : జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె మోడల్‌స్కూల్ విద్యార్థిని సి.గురుప్రియ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కే.ఎ స్.ఎన్.మూర్తి, పీఈటీ మణి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం బైపీసీ చదువుతున్న సి.గురుప్రియ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గత నెలలో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో అండర్-19 బాలికల విభాగం హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. జనవరి 5 నుంచి 12 వరకు జరిగే హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున క్రీడాపోటీల్లో పాల్గొంటుందన్నారు. గురుప్రియను పాఠశాల ప్రిన్సిపాల్, పీఈటీ, ఉపాధ్యాయబృందం అభినందించారు.